సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం ▪ 28 ▪ సెప్టెంబర్ ▪ 2024



భావి తరాలకు ఆదర్శం

తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ భావి తరాలకు ఆదర్శమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. 10లో



ముగిసిన జిల్లాస్థాయి క్రీడలు

రెండు రోజులుగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు శుక్రవారం ముగిశాయి. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 25°

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామునే గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువు దీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ సదస్సుకు ఎంపిక



సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: ప్రపంచ సాహితీ సదస్సుకు అశ్వారావుపేటకు చెందిన సాహితీవేత్త, సి.నా.రె అవార్డు గ్రహీత డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు ఎంపికయ్యారు. సదస్సు సంచాలకులు రాధిక మంగిపూడి నుంచి ఆయనకు సమాచారం అందింది. ఈమేరకు శుక్రవారం ప్రభాకరాచార్యులు వివరాలు వెల్లడించారు. వచ్చే నెల 22,23వ తేదీల్లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్ర కళావేదిక ఖతార్ సంయుక్తంగా ఖతార్ దేశంలోని దోహా నగరంలో సదస్సు నిర్వహించనున్నారు. సదస్సులో 'తెలుగు సాహితీ వనంలో వ్యంజకాలు' అనే అంశంపై ప్రభాకరాచార్యులు పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. అశ్వారావుపేట వాసికి అరుదైన అవకాశం దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పండగ కళ ఏదీ?

కొత్తగూడెం ఎంజీ రోడ్డులో తగ్గిన రద్దీ

- కస్టమర్లులేక బోసిపోతున్న ప్రధాన మార్కెట్లు
- ఈ-కామర్స్, కార్పొరేట్ సంస్థల నుంచి పోటీ
- మార్కెట్లకు శాపంగా మారిన పార్కింగ్ సమస్య
- వ్యాపారం తగ్గడంతో ప్రమాదంలో వర్కర్ల ఉపాధి



వెలవెలబోతున్న కొత్తగూడెంలోని చిన్న బజార్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పండుగల సీజన్ దసరా నుంచి సంక్రాంతి వరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో దుకాణాలు కళకళలాడేవి. ఎంజీరోడ్డు, పెద్ద బజార్, చిన్నబజార్‌లు రద్దీగా మారేవి. షాపుల్లో పని చేసే వర్కర్లను ఇంటికి పంపేందుకు అవకాశం లేకుండా ఉండేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ఒకప్పుడు ఏటీఎంల తరహాలో 18 గంటలు తెరిచి ఉంచిన షాపులకు ఇప్పుడు పట్టపగలు సైతం కస్టమర్లు పలుచగానే వస్తున్నారు. వ్యాపారాలు దెబ్బతినడంతో పనులు దొరక్క వర్కర్లు ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. జిల్లా వ్యాపారాలకు ఆయువుపట్టు వంటి ఈ ప్రాంతాన్ని కాపాడేందుకు, వర్కర్ల భవిష్యత్‌కు భరోసా ఇచ్చేలా మున్సిపల్ పాలకవర్గం, ప్రభుత్వం ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

ఒకప్పుడు 7 వేల మందికి ఉపాధి

సింగరేణి సంస్థ రాకతో కొత్తగూడెం పట్టణానికి పునాదులు పడ్డాయి. దీంతో స్థానికుల అవసరాల కోసం ముందుగా పెద్ద బజార్, ఆ తర్వాత చిన్న బజార్‌లు వెలిశాయి. ఈ రెండు బజార్లు నిత్యం కిక్కిరిసిపోతుండటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించే మహాత్మాగాంధీ (ఎంజీ) రోడ్డులో కూడా వ్యాపార, వాణిజ్య సంస్థలు విస్తరించాయి. కొత్తగూడెంతోపాటు పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం పరిసర ప్రాంతాల ప్రజలు కూడా కొత్తగూడెంపైనే ఆధారపడే వారు. దీంతో 90వ దశకంలో అప్పటి ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఖమ్మాన్ని మించిపోయేలా ఇక్కడ టెక్స్‌టైల్స్, కన్జ్యూమర్స్ గూడ్స్ విభాగంలో వ్యాపారం జరిగేది. ఫలితంగా ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఆతిథ్యం, ఆస్పత్రులు, జ్యూయలరీ, నిత్యావసరాల దుకాణాలు వెలిశాయి. వీటిల్లో ఏడువేల మందికి పైగా వర్కర్లు పని చేస్తూ తమ కుటుంబాలను పోషించుకునేవారు.

పరిశ్రమల మూత, ఈ-కామర్స్ విస్తరణతో ప్రభావం

గడిచిన పదిహేనేళ్లుగా కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచలలో పరిశ్రమలు మూతపడటంతో కార్మికులు, ఉద్యోగుల సంఖ్య తగ్గిపోయింది. మరోవైపు ఇంటర్నెట్ వినియోగం పెరిగిపోవడంతో ఈ కామర్స్ రంగం విస్తరించడం మొదలైంది. బడా కార్పొరేట్ సంస్థల రాకతో క్రయవిక్రయాల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. దీంతో ఎంజీ రోడ్డు, పెద్ద బజార్, చిన్న బజార్‌లలో కొనసాగే సంప్రదాయ వాణిజ్యం, వ్యాపారాలకు సవాల్ ఎదురైంది. 2016లో కొత్తగూడెం 'భద్రాద్రి' జిల్లా కేంద్రంగా మారడం, కొత్తగా పోలీస్ బెటాలియన్ రావడంతో పరిస్థితి మెరుగైంది.

దుకాణాలు బోసిపోతున్నాయి..

ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో సైకిళ్లు మాయమై ద్విచక్ర వాహనాలు పెరిగాయి. కరోనా సంక్షోభం తర్వాత కార్ల వాడకమూ ఎక్కువైంది. 70 ఏళ్ల కిందట ఏర్పాటైన నేతాజీ మార్కెట్, గణేష్ టెంపుల్ గల్లీ, పెద్దబజార్, చిన్నబజార్, ఎంజీరోడ్డు, సూపర్ బజార్ గల్లీలు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా లేవు. ఎంజీ రోడ్డుతో సహా అన్ని ప్రధాన బజార్లలో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. ఫలితంగా వాహనాల్లో ఇక్కడికి వచ్చి క్రయవిక్రయాలు సాగించడం కష్టంగా మారింది. కస్టమర్ల సంఖ్య తగ్గిపోవడంతో వ్యాపారాలు సాగక వివిధ దుకాణాలు, షాపుల్లో పని చేసే వర్కర్లను పని నుంచి తీసేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో కనీసం రెండు వేల ఐదు వందల మంది వర్కర్లు వారి కుటుంబాలతో సహా ఇక్కడి ఉపాధి లభించక ఇతర ప్రాంతాలు తరలిపోయినట్టు సమాచారం. కొత్తగూడెం ఓటర్ల లిస్టులో తగ్గిన జనాభాయే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే మేలు

జిల్లాలో ప్రధాన వ్యాపారాలకు ఎంజీరోడ్డు, పెద్ద బజార్, చిన్న బజార్, సూపర్ బజార్ గల్లీలు ఇప్పటికీ ప్రధాన అడ్డాలుగా ఉన్నాయి. ఓ వైపు ఈ-కామర్స్ మరోవైపు బడా షాపింగ్ మాల్స్ నుంచి పోటీ వస్తున్నా తట్టుకుని నిలబడగలుగుతున్నాయి. కానీ వాహనాల పార్కింగ్ వంటి కనీస సౌకర్యం కూడా లేకపోవడంతో రావాల్సిన కస్టమర్ కూడా రాకుండా పోయే పరిస్థితి నెలకొంది. విశాలమైన పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే తమ బిజినెస్ నిలదొక్కుకుంటుందని ఇక్కడి వ్యాపార ప్రముఖులు అంటున్నారు. లేదంటే పరిస్థితులు దిగజారుతాయని, తమ దగ్గర పని చేసే వర్కర్లకు జీతాలు చెల్లించేందుకూ కటకటలాడే పరిస్థితులు దాపురిస్తాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచీ ఇన్‌చార్జిలే..

- ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించని ప్రభుత్వం
- జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌దీ అదే పరిస్థితి
- హాస్పిటల్‌లో బాధితులతోపాటు వైద్య విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



ప్రభుత్వ వైద్య కళాశాల

కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలతోపాటు జిల్లా సర్వజన ఆస్పత్రిని మూడేళ్లుగా ఇన్‌చార్జిల పాలనతో నెట్టుకొస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రారంభమైన నాటి నుంచి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించలేదు. డీఎంఈ నిబంధనల ప్రకారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోస్టుల్లో అడిషనల్ డైరెక్టర్ కేడర్ అధికారులను నియమిస్తారు. గత ప్రభుత్వం అడిషనల్ డైరెక్టర్‌కు 65 వయసు ఆర్డినేటర్ చేయగా, అప్పటి గవర్నర్ తమిళి సై ఒప్పుకోలేదు. దీంతో పదోన్నతులు లేకుండాపోయాయి. ఫలితంగా సీనియర్ ప్రొఫెసర్లకు ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు.

అవినీతి ఆరోపణలతో ప్రిన్సిపాల్ సరెండర్

2021–2022 సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాకు వైద్య కళాశాల మంజూరైంది. అప్పుడు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా లక్ష్మణ్‌రావు, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా బోడ కుమార్‌స్వామిని నియమించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు రావడంతో అప్పటి కలెక్టర్ ప్రియాంక ఆల సూపరింటెండెంట్ కుమారస్వామిని డీఎంఈకి సరెండర్ చేశారు. అతని స్థానంలో జిల్లా మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో పనిచేస్తున్న పిల్లల వైద్య నిపుణులు, సీనియర్ ప్రొఫెసర్ రాధామోహన్‌కు బాధ్యతలు అప్పగించారు. అవినీతి ఆరోపణలు, విద్యార్థినులపై వేధింపుల నేపథ్యంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావును కూడా సరెండర్ చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రాజకుమార్ బాధ్యతలు చేపట్టారు.

ఆర్‌ఎంఓలదీ అదే పరిస్థితి

జిల్లా సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓగా నాగేశ్వరరావు, ఎంసీహెచ్‌లో దయానందస్వామిలు విధులు నిర్వర్తించారు. వారి బదిలీ అనంతరం ఎంసీహెచ్‌కు వీరబాబును ఇన్‌చార్జిగా నియమించారు. జిల్లా సర్వజన ఆస్పత్రికి ఇన్‌చార్జి ఆర్‌ఎంఓగా పుష్పలత కొనసాగారు. ఆమె ఖమ్మం సర్వజన ఆస్పత్రికి బదిలీ కాగా, డాక్టర్ రమేష్‌ను ఇన్‌చార్జి ఆర్‌ఎంఓగా కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వం ఆమోదిస్తే పదోన్నతులు..

డీఎంఈ పరిధిలోని అడిషనల్ డైరెక్టర్ పదోన్నతుల వయసు సడలింపు ఆర్డినేటర్లు గత ప్రభుత్వం రూపొందించిన అప్పటి గవర్నర్ తమిళిసై అంగీకరించలేదు. దీంతో అడిషనల్ డైరెక్టర్ పదోన్నతులు లభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడిషనల్ డైరెక్టర్ వయసు నిబంధనలు సడలించి అసెంబ్లీలో చట్టాన్ని రూపొందించారు. అనంతరం సర్వీసు రూల్స్ మార్పుచేశారు. దీంతో అడిషనల్ డైరెక్టర్ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ రాగా, దస్త్రం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. త్వరలోనే అడిషనల్ డైరెక్టర్ కేడర్ అధికారులను వైద్య కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లుగా నియమించే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో సీనియర్ ప్రొఫెసర్లకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఆస్పత్రిలో అన్నీ సమస్యలే ..

జిల్లా సర్వజన ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో వైద్యులు, ఎక్స్‌రే, స్కానింగ్ టెక్నీషియన్ల కొరతతోపాటు, కృత్రిమ శ్వాస అందించే వెంటిలేటర్ల సమస్యలు వేధిస్తున్నాయి. ఎంసీహెచ్‌లో ఈ నెల 1 నుంచి స్కానింగ్ తీయడం లేదు. దీంతో గర్భిణులను సర్వజన ఆస్పత్రికి పంపిస్తున్నారు. రెండు ఆస్పత్రుల్లోనూ మందుల కొరత ఉంది. కాగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్పందించి మందుల కొనుగోలుకు రూ. 12 లక్షలు కేటాయించారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7వ దశ కర్మాగారంలో గురువారం రాత్రి విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. 250 మెగావాట్ల సామర్థ్యం కలిగి కేటీపీఎస్ 5వ దశ కర్మాగారంలోని 9వ యూనిట్‌లో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడ కూడా ఉత్పత్తిని నిలిపివేశారు. కాంప్లెక్స్ వ్యాప్తంగా 1050 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయినట్లయింది. సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావుల ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. శనివారం ఉత్పత్తి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

3 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 3 నుంచి 9 వరకు థియరీ పరీక్షలు, 16 నుంచి 23వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతిలో 596 మంది విద్యార్థులు, ఇంటర్‌లో 631 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్లు విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు జరుగనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు వైద్యులకు మంత్రి అభినందన

'పేదల ముంగిట ఖరీదైన వైద్యం'కు దామోదర రాజనర్సింహ ప్రశంసలు

ఇల్లెందు: జిల్లాలో మొట్టమొదటిసారి ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో ఎండోస్కోపిక్ ద్వారా ముక్కు దూలం వంకర, పెరిగిన కండ తొలగింపు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ రవితేజశ్రీతోపాటు సిబ్బందిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఇల్లెందు మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుడు కలీం 12 ఏళ్లుగా ముక్కు జబ్బుతో బాధపడుతున్నాడు. అతనికి ఆర్థికభారం లేకుండా ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఇదే విషయమై 'సాక్షి'లో శుక్రవారం 'పేదల ముంగిట ఖరీదైన వైద్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని మంత్రి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేస్తూ ఇల్లెందు వైద్యులను, నర్సింగ్, ఇతర సిబ్బందిని అభినందించారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్, కార్పొరేట్‌తోనూ పోటీ పడగలరని మరోమారు నిరూపించారని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ పోరిక బలరాం నాయక్ తదితరులు అత్యాధునిక పరికరాలను సమకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



Minister for Health Depart
@MoHFW_Telangana
Follow

Appreciating our Doctors, Nursing officers and other staff for their efforts and commitment towards the patients.

We are focusing on strengthening Hospitals and Medical Services.

మంత్రి దామోదర రాజనర్సింహ అభినందిస్తూ పెట్టిన పోస్టు

వేస్ట్‌తో ఆర్ట్ పోటీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేలా వేస్ట్‌తో ఆర్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మనకు కనిపించే అనేక రకాల వ్యర్థ పదార్థాలతో ఉపయోగపడే కళాత్మక వస్తువులను తయారు చేసి జిల్లాస్థాయిలో ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కళాత్మకమైన వస్తువులను తయారు చేసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయుల ధ్రువీకరణతో అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో హాజరు కావాలని కోరారు. 6 నుంచి 10వ తరగతుల వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు విభాగాలుగా పోటీలు ఉంటాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేస్తారని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల వివరాలను ఈ నెల 28వ తేదీ ఉదయం 11 గంటలలోపు హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల ద్వారా అందజేయాలని తెలిపారు.

'పాత ప్లాన్' కొత్తగా..

- గతంలో రూపొందించిన భద్రాద్రి మాస్టర్ ప్లాన్‌కు సొబగులు
- ప్రభుత్వ సూచనలతో శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి
- విడుదలయ్యే నిధుల ప్రకారం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు
- స్థపతి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నూతన ప్రణాళికలు



పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం భద్రాచలం రామాలయ నమూనా

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన మాస్టర్ ప్లాన్‌కు అధికారులు కొత్త సొబగులు తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గతంలో చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కే మార్పులు, చేర్పులు చేస్తుండగా పర్యాటకులకు ఆకర్షించేలా నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

భూసేకరణకు నిధులు రావడంతో..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనందసాయి పలు స్కెచ్‌లను రూపొందించారు. ప్రధాన కోవెలతోపాటు మాడ వీధుల విస్తరణ, వెయ్యికాళ్ల మండపం, రెండో ప్రాకారంతో సహా మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. దీనిని నాటి సీఎం కేసీఆర్ ఆమోదించినా కార్యరూపం దాల్చలేదు. ఇందులో తొలి అడుగు ఆలయానికి రెండు పక్కల భూ సేకరణ చేయాల్సి ఉంది. దీంతో అదే మాస్టర్‌ప్లాన్‌లో రూపొందించినట్లు మాడ వీధుల విస్తరణకు అవసరమైన భూ సేకరణ, ఇళ్ల తొలగింపుపై దేవస్థానం, రెవెన్యూ అధికారులు సర్వే చేసి, నివేదికను అందజేశారు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ సేకరణకు రూ.60.20 కోట్లను విడుదల చేయగా, ఆ తర్వాత ఆచరించాల్సిన ప్రణాళికపై దేవస్థానం అధికారులు దృష్టి సారించారు.

ప్రభుత్వ నిధుల ప్రకారం పనులు చేపట్టేలా..

సీఎం రేవంత్ రెడ్డి నిధుల ప్రకటన కాకుండా ఆలయ అభివృద్ధికి తొలుత ప్రణాళికలను పంపించాలని ఆదేశించారు. దీంతో దేవస్థానం అధికారులు పలు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రాధాన్యత కేటగిరీలో అభివృద్ధి పనులను విభజించారు. ప్రభుత్వం విడతల వారీగా రూ. 200 కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు నిధులు విడుదల చేస్తే మరో మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. ఇలా ప్రాధాన్యత ప్రకారం దేవస్థానంలో అవసరాలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్థపతి సూర్యనారాయణ మూర్తికి నూతన మాస్టర్ ప్లాన్ స్కెచ్‌ల బాధ్యతను అప్పగించారు. ప్రస్తుతం రాముడు కొలువై ఉన్న ప్రధాన ఆలయాన్ని భక్త రామదాసుగా పిలిచే కంచర్ల గోపన్న 1620లో నిర్మించాడు. అప్పటి నుంచి ప్రధాన గోపురం అదేవిధంగా ఉంది. ఇతర ఉపాలయాలు, అంతరాలయంలో మాత్రం మార్పులు జరిగాయి. అంతరాలయం అంతర్భాగం, పైకప్పు కొద్ది మేర దెబ్బతిన్నది. ప్రభుత్వం విడతల వారీగా నిధులను కేటాయిస్తే తొలుత ఈ ప్రధాన కోవెల మార్పు నిర్మాణమే జరిగే అవకాశం ఉంది. ఆ తర్వాత రెండో ప్రాకార నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేశారు. ప్రతి ఏడాది ఘనంగా జరిగే ముక్కోటి రోజున స్వామి వారు దర్శనమిచ్చే ఉత్తర ద్వారం ఎప్పటి నుంచో ఇబ్బందులు పెడుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా స్కెచ్‌ను రూపొందిస్తున్నారు. ఇక కొలను, డార్మెటరీ హాల్స్, ప్రధాన ఆలయం నుంచి గోదావరి ఒడ్డుకు వెళ్లే రహదారి తదితర ప్రతిపాదనలను స్థపతి ముందు ఉంచారు. వీటికి అనుగుణంగా కొత్త ప్రణాళికలు రూపొందుతున్నాయి. భూ సేకరణకు సుమారు ఆరు నెలలు పట్టే అవకాశం ఉండటంతో పకడ్బందీగా భవిష్యత్ అవసరాలకు, భక్తులకు అన్ని వసతులతో తగినట్లు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు.

భూ సేకరణకు నోటిఫికేషన్..

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి భూ సేకరణ చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. రామాలయం చుట్టు పక్కల అభివృద్ధికి ఎకరన్నర స్థల సేకరణకు ఇళ్లు, ఇతర ఆస్తుల స్వాధీనంలో నష్టపరిహారానికి ప్రభుత్వం రూ.60.20 కోట్లను విడుదల చేసినట్లు ఇందులో పేర్కొన్నారు. ఇక రెవెన్యూ అధికారులు భూ సేకరణకు ఉపక్రమించనున్నారు.

భక్తులు ఏమి కోరుతున్నారంటే..

- ఆధ్యాత్మిక కేంద్రం, టూరిజం హబ్‌గా ఉన్న భద్రాచల పుణ్యక్షేత్రంలో భక్తులు అధిక సమయం గడిపేలా సందర్శనీయ స్థలాలను అనుసంధానం చేయాలి.
- దేవస్థానానికి అనుబంధంగా ప్రాచీన చరిత్ర ఉన్న శివాలయం, నృసింహస్వామి ఆలయం, తాతగుడి సెంటర్‌లో గోవిందరాజ స్వామి, రంగనాయక ఆలయం, భక్త రామదాసు ధ్యానమందిరాలను అభివృద్ధి చేయాలి. రామాలయం నుంచి ఆయా ఆలయాలకు వరకు ఫ్లైఓవర్ ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మించాలి.
- రామాలయం నుంచి గోదావరి కరకట్ట వరకు ములుగు జిల్లాలో లక్నవరం చెరువు, హైదరాబాద్‌లో దుర్గంచెరువుపై నిర్మించిన తరహాలో ఇక్కడా కేబుల్ బ్రిడ్జి నిర్మించాలి. ఆలయం నుంచి గోదావరి తీరం వరకు, రంగనాయకుల గుట్ట వరకు రోప్‌వే నిర్మించాలి.
- కరకట్ట మీద మినీ ట్యాంక్‌బండ్, కాఫీ షాప్‌లు, బోటింగ్ పాయింట్‌లు, గోదావరి వ్యూ పాయింట్‌లు ఏర్పాటు చేయాలి.

భక్తులు, స్థానికుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసకుని అధికారులు నూతన మాస్టర్ ప్లాన్ రూపొందించాలి.

కనకగిరి అందాలను ప్రజలు వీక్షించేలా చేస్తా..

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



గుట్టల వద్దకు ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, విద్యార్థులు

చంద్రుగొండ : మండలంలోని బెండాలపాడు శివారులో ఉన్న కనకగిరి అటవీప్రాంతంలో ఉన్న ప్రకృతి అందాలు ప్రజలు వీక్షించేలా, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని కనకగిరి గుట్టలను శుక్రవారం ఆయన సందర్శించారు. గుట్ట మీద ఉన్న వీరభద్రుడి ఆలయాన్ని దర్శించుకున్నారు. అటవీ శాఖ రేంజర్ ఎల్లయ్యతోపాటు కొత్తగూడెం నుంచి వచ్చిన కళాశాల విద్యార్థులతో కలిసి కాకతీయుల కట్టడాలను వీక్షించారు. తొలుత హస్తాల వీరన్నస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. భోగందాని గుళ్లను, కోనేరు, పల్లేరుబావి తదితర కట్టడాలను పరిశీలించారు. దాదాపు 20 కిలోమీటర్లు కాలినడకన తిరిగిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎస్‌ఐ గంజి స్వప్న, వివిధ శాఖాధికారులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, ఉప్పతల ఏడుకొండలు, ఫజల్‌బక్ష్, బ్యాంబో క్లస్టర్ బాధ్యులు ఈసం నాగభూషణం, బొర్రా సురేష్, మల్లం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కళాబృందానికి అభినందనలు



డప్పుకొడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తూ విరాళాలు సేకరిస్తున్న మూర్తజా కళాబృందాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభినందించారు. మండలంలోని గండుగులపల్లిలో శుక్రవారం ప్రదర్శనలు నిర్వహిస్తున్న మూర్తజా కళాబృంద సభ్యులతో కలిసి ఎమ్మెల్యే డప్పు వాయించారు. వారితో కలిసి కాసేపు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రెండు నెలల వేతనాన్ని వరద బాధితుల సహాయార్థం ఇచ్చానని చెప్పారు. కార్యక్రమంలో స్థానికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న నాజర్‌పాషా

మణుగూరురూరల్: కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధనకు ఈ నెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇఫ్టూ అనుబంధ గోదావరిలోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డీ నాజర్‌పాషా పిలుపునిచ్చారు. మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీతో పాటు వివిధ గనులు, డిపార్ట్‌మెంట్లలో శుక్రవారం జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈఎస్‌ఐ, వైద్య సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా రూ.5 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎ.మంగీలాల్, టి.లక్ష్మీనారాయణ, బి.నగేశ్, జి.సంజీవరావు, ఎం.నాగరాజు, రామ్మూర్తి, లింగన్న, వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీను, జె.కృష్ణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాణించిన క్రీడాకారులు



క్రీడాకారులతో పీడీలు, పీఈటీలు

దుమ్ముగూడెం: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులపాటు జరిగిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాపోటీల్లో భద్రాచలం జోనల్ క్రీడాకారులు ప్రతిభ చూపారు. సీనియర్ వాలీబాల్ విభాగంలో బాలుర టీం మొదటి బహుమతి, సీనియర్ ఖో–ఖో బాలికలు ద్వితీయస్థానం, జూనియర్ వాలీబాల్ బాలికలు మొదటి స్థానం, జూనియర్ వాలీబాల్ బాలురు ద్వితీయ స్థానం, జూనియర్ ఖో–ఖో ద్వితీయ స్థానం సాధించారు. భద్రాచలం క్రీడల జోనల్ సెక్రెటరీ దశం బాబు, పీడీలు శ్రీనివాస్, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, జయ, కేజియా, వసంతరావు, బాబూరావు, పీఈటీలు జానకి, పార్వతి, గంగరాజు క్రీడాకారులను అభినందించారు.

చంద్రుగొండకు ఢిల్లీ పోలీసులు

మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలికి కోర్టు నోటీస్



స్థానికుల నుంచి లేఖ తీసుకుంటున్న ఢిల్లీ పోలీస్

చంద్రుగొండ: మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మకు ఢిల్లీ కోర్టు నోటీస్ జారీ చేసింది. ఈ క్రమంలో అక్కడి ఏఎస్‌ఐ రాజేశ్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం చంద్రుగొండకు చేరుకున్నారు. సీతమ్మ అందుబాటులో లేకపోవడంతో స్థానికులతో లిఖితపూర్వకంగా లేఖ తీసుకుని ఢిల్లీ పోలీసులు తిరుగుపయనమయ్యారు. వివరాలిలా ఉన్నాయి.. 2005–2006లో అప్పటి ఉమ్మడి మండల సమాఖ్యకు రాష్ట్రీయ మహిళాకోష్ పథకంలో భాగంగా రూ.50 లక్షల రుణాలు ఇచ్చారు. అయితే అందులో రూ.37 లక్షల వరకు మహిళా సంఘాలు అప్పట్లో తిరిగి చెల్లించాయి. రూ.13 లక్షలు మిగులు చెల్లించాల్సి ఉంది. అప్పటి నుంచి ఆ రుణ బకాయి వడ్డీల రూపంలో మళ్లీ రూ.47 లక్షలకు చేరింది. ఈ చెల్లింపుల అంశంపై ఢిల్లీ కోర్టులో కేసు నడుస్తోంది. దీంతో అక్కడి కోర్టు సమాఖ్య మాజీ అధ్యక్షురాలైన సీతమ్మకు సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 18లోపు ఆ రుణం మొత్తం చెల్లించాలని నోటీసులో కోర్టు పేర్కొంది.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

భావి తరాలకు ఆదర్శం.. బాపూజీ

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పించాక మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్య్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ భావి తరాలకు ఆదర్శమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాపూజీ 1969 సంవత్సరంలో తొలిదశ తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు.

పోషణలోపం నివారణకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో పోషణలోపం నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినెలా మొదటి వారంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, పిల్లల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని చెప్పారు.

పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించాలి

విద్యార్థులకు పర్యాటక ప్రాంతాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని క్రీడాసంఘాల అసోసియేషన్ సెక్రటరీలు, క్రీడాకారులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువ కళాకారులు చేపట్టిన కనకగిరి గుట్టల విహార యాత్రను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రెండు బస్సుల్లో సుమారు 100 మంది తరలి వెళ్లారు.

హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం బాలికల సంక్షేమ పోస్టు మెట్రిక్ హాస్టల్‌ను కలెక్టర్ జితేష్ పాటిల్ శుక్రవారం సందర్శించారు. వంట షెడ్, వసతి గృహంలోని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రశస్త్ యాప్ ద్వారా దివ్యాంగులను గుర్తించాలి

సుజాతనగర్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రశస్త్ యాప్ ద్వారా దివ్యాంగులందరినీ గుర్తించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం ఆయన సుజాతనగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. అక్టోబర్ 26 వరకు 19 సంవత్సరాలోపు విద్యార్థులందరినీ 60 అంశాలపై ప్రాథమిక సర్వే నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మహిళా శిశు సంక్షేమాధికారి వేల్పుల విజేత, బీసీ సంక్షేమాధికారి బి.ఇందిర, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి దాసరి అనసూర్య, ఎల్‌బీఎం ఎం.రావిరెడ్డి, డీఈఓ బాలాజీ, డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, కె. హనుమంతరావు, ఎస్‌కె సైదులు, లీల, సునీత, సంఘ నాయకులు మోత్కూరి ధర్మారావు, చిప్పా శ్రీనివాసరావు, గుమలాపురం సత్యనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ విద్యార్థులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

పాల్వంచరూరల్: జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారు శుక్రవారం కలెక్టరేట్‌కు వెళ్లగా అభినందించి, రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.బి.ఝాన్సీ, అధ్యాపకులు బి.పావని, సిహెచ్. ప్రసన్న పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలు!

- గతంలోనే గురుకుల అధ్యాపకురాలిగా ఒకరు..
- తాజాగా మరొకరు ఏఈఈగా ఎంపిక



తల్లిదండ్రులతో లహరిప్రియ, మహతిప్రియ

ఇల్లెందు: ఇల్లెందు మండలంలోని ముకుందాపురానికి చెందిన అక్కాచెల్లెళ్ల ప్రతిభకు ఫలితం లభించింది. ఇప్పటికే అక్క గురుకులంలో అధ్యాపకురాలిగా నియామకం కాగా, ఆమె సోదరి నీటిపారుదల శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. ముకుందాపురానికి చెందిన విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ తుమ్మలపల్లి ప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లహరిప్రియ 1 నుంచి 10 వరకు విశ్వశాంతి విద్యాలయంలో, ఇంటర్, డిగ్రీ ఇల్లెందు సాహితీ కాలేజీలో, కోఠి ఉమెన్స్ కాలేజీలో ఎంఏ ఇంగ్లిష్ లిటరేచర్, హైదరాబాద్‌లోని ఇఫ్లూ యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేసింది. ఆ తర్వాత గురుకులాల్లో నియామకాలకు పరీక్షలు రాసిన ఆమె టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగాలు కైవసం చేసుకుంది. దీంతో ఇల్లెందు సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా జూలై 16న విధుల్లో చేరింది. ఇక రెండో కుమార్తె తుమ్మలపల్లి మహతిప్రియ కూడా 1 నుంచి 10 వరకు విశ్వశాంతిలో చదివి, ఖమ్మంలో ఇంటర్, ఓయూలో బీటెక్ పూర్తిచేశాక టీజీపీఎస్సీ ద్వారా ఏఈఈకి ఎంపిక కావడంతో శుక్రవారం ఉద్యోగంలో చేరింది. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మిషన్ భగీరథ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న ఈఈ తిరుమలేశ్

చంద్రుగొండ: మిషన్ భగీరథ పథకం నిర్వహణ సిబ్బందికి జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు భగీరథ పథకం జిల్లా ఈఈ తిరుమలేశ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయితీలకు 497 మంది సిబ్బంది ఉన్నారని, వారికి మండలాల వారిగా నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. చిన్న పంచాయితీలకు ఒక్కరిని, పెద్ద పంచాయితీలకు ఇద్దరు, ముగ్గురు సిబ్బందిని కేటాయించామన్నారు. చేతిపంపులు, పంపుసెట్లు, ప్యానల్‌బోర్డుల మరమ్మతులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కొత్తగూడెం డివిజన్ డీఈ శివయ్య, ఎంపీడీఓ అశోక్, ఏఈలు హరికృష్ణ, సాయికృష్ణ పాల్గొన్నారు.

నారేప దుంగలు పట్టివేత



దుంగలను చూపుతున్న అటవీశాఖ అధికారులు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు అటవీ సెక్షన్ పరిధి పాపకొల్లు బీట్–బీలో అటవీశాఖ అధికారులు నారేప దుంగలను పట్టుకున్నారు. పాపకొల్లు బీట్–బీ 31వ కంపార్ట్‌మెంట్ అటవీ ప్రాంతంలో బోడుగుట్ట ఏరియాలో గుర్తుతెలియని వ్యక్తులు చెట్లు నరకుతున్నారని అటవీశాఖ అధికారులకు తెలిసింది. ఈ నెల 20వ తేదీ రాత్రి అటవీ ప్రాంతంలోకి పాపకొల్లు అటవీ సెక్షన్ ఆఫీసర్ వి.మల్లయ్య, బీట్ ఆఫీసర్లు విజయలక్ష్మి, చింతా వెంకటేశ్వర్లు, శ్రావణ్ వెళ్లి అడవిలోనే గడిపారు. మరుసటి రోజు ఉదయం గుట్టపై నుంచి అక్రమార్కులు నారేప దుంగలను కిందకు దించుతున్న క్రమంలో అటవీశాఖ అధికారులు వెళ్లే లోపే పారిపోయారు. రెండు నారేప దుంగలను స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు ట్రాక్టర్‌పై గురువారం రాత్రి జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. ఈ దుంగల విలువ రూ.68,000 వరకు ఉంటుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని అటవీశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు.

బెల్లం వాహనం పట్టివేత..



వాహనం, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

అశ్వారావుపేటరూరల్: అక్రమంగా ఓ వాహనంలో బెల్లం తరలిస్తుండగా స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి అనుమతులు లేకుండా కుక్కునూరు వైపు బొలేరో వాహనంలో బెల్లం తరలిస్తుండగా, అశ్వారావుపేట చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. వాహనంలో 2,916 కేజీల బెల్లం, మరో 20 కేజీల పటికను స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం వాహనాన్ని అశ్వారావుపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి, జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామానికి చెందిన డ్రైవర్ మాణికల సురేశ్‌పై కేసు నమోదు చేశామని, పట్టుబడిన బెల్లం విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ రాజేశ్వరరావు, సిబ్బంది ప్రతాప్, భరత్, తిరుపతి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత..

కరకగూడెం: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఆటోలో మండలంలోని వెంకటాపురం గ్రామం నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తీసుకొస్తుండగా పట్టుకుని, ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పతనమవుతున్న పత్తి ధర

- వారంలోనే రూ.500కు పైగా దిగువకు..
- తేమ, నాణ్యత పేరిట వ్యాపారుల కొర్రీలు
- సీసీఐ కొనుగోళ్లు లేకపోవడంతో ఇష్టారాజ్యం
- నేడు కలెక్టర్ అధ్యక్షతన జరిగే భేటీలో నిర్ణయం వెలువరించే అవకాశం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తి ధర పెరుగుతుండడంతో రైతులను ఆశల పల్లకీలో విహరించినా ఆ ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. గత వారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో క్వింటాకు రూ.8,250, ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.8,000 వరకు పలికిన పాత పత్తి ధర ప్రస్తుతం రూ. 7,500గా నమోదవుతోంది. అంటే వారం తిరగకుండానే క్వింటాకు ఏకంగా రూ.500కు పైగా ధర పతనమైంది. ఆగస్టు నెల చివరి వారం వరకు రూ. 7,600 వరకు ధర పలకగా, ఈ నెలారంభంలో భారీ వర్షాల నేపథ్యాన కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇక 9వ తేదీ నుంచి పంట కొనుగోళ్లు ప్రారంభం కాగా, కేంద్రప్రభుత్వం నూనెల దిగుమతిపై సుంకం పెంచింది. ఆ ప్రభావం పత్తి గింజల ధర పెరుగుదలకు దోహదపడింది.

నిలవని రైతుల ఆశలు

క్వింటా పత్తి ధర రూ.8 వేలకు చేరడంతో ఇళ్లలో నిల్వ చేసిన రైతులు అమ్మకాలు ప్రారంభించారు. ఈనెల 16 నుంచి 21 వరకు పాత పత్తి ధర రూ.7,900 నుంచి రూ.8వేల వరకు, కొత్త పత్తి ధర రూ.7,600 నుంచి రూ.7,722గా నమోదైంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి మద్దతు ధర రూ.7,521గా ప్రకటించింది. అంతకు మించి ధర వస్తుండడంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. కానీ శుక్రవారం వ్యవసాయ మార్కెట్‌లో పాత పత్తికి గరిష్ఠంగా రూ.7,500గా, కొత్త పత్తి ధర రూ.7,011 పలికింది.

సాకులతో వ్యాపారుల మాయాజాలం

తేమ అధికంగా ఉందని, ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాణ్యత కోల్పోయిందనే తదితర కారణాలతో పాటు అంతర్జాతీయంగా పత్తి ధర మందగించిందని చెబుతూ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇంకొందరు వ్యాపారులైతే పంట కొనుగోళ్లకు ఆసక్తి కనబర్చడం లేదు. మిగిలిన వారు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సీసీఐ సెంటర్ల ఏర్పాటులో జాప్యం

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. జిన్నింగ్ మిల్లులే కేంద్రాలుగా సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. ఆపై మిల్లుల యాజమాన్యాలు జిన్నింగ్ చేసి సీసీఐ సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఇదంతా టెండర్ల రూపంలో జరగాల్సి ఉండగా.. ఆంక్షలు తమకు సమ్మతంగా లేవంటూ యాజమానులు టెండర్లకు దూరంగా ఉన్నారు. ఈనెల 29 వరకు వ్యవహారం ఓ కొలిక్కి వస్తుందని సీసీఐ, ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోంది.

ముగిసిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న క్రీడలు శుక్రవారం ముగిశాయి. అండర్–14, 17 బాలబాలికలకు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, అథెటిక్స్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 1,000 మంది పాల్గొనగా 8 జోన్‌లుగా విభజించారు. ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, డీఈఓ వెంకటేశ్వరచారి, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, ప్యానల్ గ్రిడ్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, వివిధ జోన్ల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. కాగా, పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఇల్లెందు మండలం నిలిచింది.

ఫలించిన నిర్వాసితుల పోరాటం

టేకులపల్లి: సీపీఎం అండతో కేటీసీ–2 పిట్–2, 3 నిర్వాసితుల 8 ఏళ్ల పోరాటం ఫలించిందని, నిర్వాసితులకు భూమికి బదులుగా భూమి, నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2008లో సింగరేణి సంస్థ కోయగూడెం ఓసీ–2, పిట్ 2, 3 గనుల కోసం ఎలాంటి నష్టపరిహారం, పునరావాసం చెల్లించకుండా గిరిజనుల సాగుభూములు 750 ఎకరాలు సేకరించిందన్నారు. అధికారులు న్యాయం చేయకపోవడంతో 2008లో హైకోర్టును ఆశ్రయించామని, 2012లో నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పు చెప్పిందని, అప్పుడు సింగరేణి, రెవెన్యూ అధికారులు పునరావాసంగా నామమాత్రపు పరిహారం ఇచ్చి, భూమి నష్టపరిహారం ఇవ్వకపోవడంతో మళ్లీ 2016లో భూమికి బదులు భూమి, నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఎనిమిదేళ్ల న్యాయ పోరాటం నేడు గెలిచిందని పేర్కొన్నారు. నిర్వాసితుల కోసం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ నిర్వాసిత గ్రామాల్లో చైతన్య పాదయాత్ర నిర్వహించారని గుర్తు చేశారు.

భూ ఆక్రమణదారులపై కేసు

అశ్వాపురం: మండలంలోని అశ్వాపురం రేంజ్‌లోని మిట్టగూడెం బీట్ జగ్గారం గ్రామంలో ఫారెస్ట్ భూమి ఆక్రమణకు పాల్పడిన జగ్గారం గ్రామానికి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదైంది. రేంజర్ రమేశ్ ఆధ్వర్యంలో అటవీ హక్కుల చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైద్యం వికటించి బాలింత మృతి

మృతదేహంతో బంధువుల ఆందోళన

సత్తుపల్లి: వైద్యం వికటించి బాలింత మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారానికి చెందిన తమ్మిశెట్టి శ్రావణి (21)కి నెలలు నిండడంతో సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు గురువారం రాత్రి వైద్యురాలు ఆపరేషన్ చేయడంతో ఆడపిల్లకు జన్మనిచ్చింది. కానీ ఆపరేషన్ వికటించినట్లు తెలియగా, తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో బాలింతను గురువారం అర్ధరాత్రి ఖమ్మం రెఫర్ చేశారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరిన శ్రావణిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించగా హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. ఈ మేరకు ఆమె మృతదేహాన్ని తీసుకొచ్చిన బంధువులు శుక్రవారం రాత్రి సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రి వద్ద ఆందోళనకుదిగారు. కాగా, సత్తుపల్లి సీఐ కిరణ్ సిబ్బందితో చేరుకుని పర్యవేక్షించారు. అయితే, ఆస్పత్రి బాధ్యులు, శ్రావణి బంధువుల మధ్య రాజీ కుదుర్చేందుకు కొందరు వైద్యులు, ప్రముఖులు చర్చలు మొదలుపెట్టారు. ఏదిఏమైనా శ్రావణి మృతితో కళ్లు కూడా తెరవని ఆమె బిడ్డను చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

దేవర బెనిఫిట్ షో తీవ్ర ఆలస్యం

వెంకటేశ్వర థియేటర్ ధ్వంసం



థియేటర్‌లో అద్దాలు పగులగొట్టిన దృశ్యం

పాల్వంచ: జూనియర్ ఎన్‌టీఆర్ నటించిన దేవర సినిమా బెనిఫిట్ షో ఆలస్యం కావడంతో అభిమానుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో సినిమా థియేటర్ యాజమాన్యంపై ఘర్షణకు దిగి.. వస్తువులు, అద్దాలను ధ్వంసం చేశారు. దేవర సినిమా రిలీజ్ శుక్రవారం ఉండగా బెన్‌ఫిట్ షో ఉదయం 5 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. ఈమేరకు సినిమా టిక్కెట్లను గురువారం రాత్రే అధిక ధరలకు విక్రయించారు. అయితే ఉదయం 8 గంటల వరకు సాంకేతిక సమస్య కారణంగా ప్రదర్శన ఆలస్యం అయింది. ఈ విషయంపై థియేటర్ సిబ్బందిని ఎన్నిసార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో గంటల కొద్ది వేచి ఉన్న అభిమానులు యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. థియేటర్ ప్రాజెక్టర్ కేబిన్ అద్దాలు, కూల్‌డ్రింక్స్ స్టాల్‌ను ధ్వంసం చేశారు. అనంతరం థియేటర్ ముఖ ద్వారం వద్ద ఉన్న అద్దాలను ధ్వంసం చేసి బీభత్సం సృష్టించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ అక్కడికి చేరుకుని గొడవను సద్దుమణిపించారు. అనంతరం సినిమా ప్రదర్శన ప్రారంభించడంతో అంతా వెళ్లిపోయారు. కాగా ఈ విషయంపై ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు రాలేదని పట్టణ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండలంలోని నాగుపల్లిలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. నాగుపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.4,550 నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో...

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పేకాట స్థావరంపై మణుగూరు పోలీసులు దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. శ్రీశ్రీనగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా ఎస్‌ఐ రంజిత్ దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.1,020 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రెడ్డిపాలెం గ్రామంలో...

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పదిమందిని అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి రూ.1.72 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు, ఒక కారు, ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

పాల్వంచరూరల్: కిరాణా దుకాణంలో విక్రయిస్తున్న నిషేధిత గుట్కా ప్యాకెట్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సీతానగర్ కాలనీలోని కిరాణా దుకాణంలో ఏఎస్‌ఐ సుధాకర్ తనిఖీ చేయగా రూ.1,820 విలువ గల గుట్కా ప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారి ఉదారపు రామశాంతయ్యపై కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

సింగరేణి(కొత్తగూడెం): మానసిక సమస్యలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం కొత్తగూడెం టూటౌన్ పరిధిలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. రామవరం 7వ నంబర్‌బజార్ వాసి శకుంతల పాషి కుమార్తె సంజురాణి(28)కి ఏడేళ్ల కిందట ఇల్లెందుకు చెందిన కిశోర్‌తో వివాహం కాగా వారికి పాప ఉంది. కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్న సంజురాణి ఐదు నెలలుగా రామవరంలో ఉంటోంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రమేశ్‌కుమార్ వివరించారు.

కల్తీ.. చంద్రబాబు సృష్టి

శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని తేలుతోంది: వైఎస్ జగన్

''రాజకీయ దుర్బుద్ధితో, పచ్చి అబద్ధాలతో తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి చంద్రబాబునాయుడే తప్పు చేశాడు. దీనిపై విచారణకు అయనే సిట్ వేస్తాడు. ఆయన చెప్పు చేతుల్లో ఉన్న అధికారులతో సిట్ అంటాడు. ఇదెక్కడి ధర్మం? ఇదెక్కడి పద్ధతి? చంద్రబాబు ఈ మాదిరిగా హిందూ ధర్మం మీద దుష్ప్రచారం చేస్తూ రాజకీయం చేయడం ధర్మమేనా? ఆలోచించండి''

''నేను తిరుపతికి వెళ్లకూడదట..! దేవుడిని దర్శించుకోకూడదట..! కారణం నా మతం అంటున్నారు. నాలుగు గోడల మధ్య నేను బైబిల్ చదువుతా. తప్పేముంది? బయటకు వెళ్తే హిందూ సంప్రదాయాలను అనుసరిస్తా, గౌరవిస్తా. ఇస్లాంను అనుసరిస్తా, గౌరవిస్తా. సిక్కిజమ్‌ను అనుసరిస్తా, గౌరవిస్తా. నా మతం ఏమిటని అడుగుతున్నారు.. నా మతం.. మానవత్వం. డిక్లరేషన్‌లో రాసుకుంటారేమో రాసుకోండి''

''రాజ్యాంగం పీఠికలో ఏం చెప్పారు? ఇండియా ఈజ్ ఏ సావరిన్, సోషలిస్ట్, సెక్యులర్, డెమొక్రటిక్ రిపబ్లిక్ (భారత్ సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం) సెక్యులర్ అంటే అర్థం తెలుసా? నీ మతం చెప్పకపోతే గుడిలోకి రావొద్దు అంటున్నావ్! ఇది సెక్యులర్ దేశం అంటున్నాం. సీఎంగా పని చేసిన వ్యక్తి పరిస్థితే ఇలా ఉంటే ఇక దళితులను గుడిలోకి పోనిస్తారా? రానిస్తారా?''

''మతం పేరుతో రాజకీయం చేయడం ఎంత దౌర్భాగ్యం? బీజేపీ నేతలు హిందుత్వానికి ప్రతినిధులుగా చెప్పుకుంటారు. మరి మీ కళ్లెదుటే మీ ఎన్డీఏ కూటమిలో భాగంగా ఉన్న వ్యక్తే శ్రీ వెంకటేశ్వరస్వామి విశిష్టతను, తిరుపతి లడ్డూ పేరు ప్రఖ్యాతులను, స్వామి వారి వైభవాన్ని దెబ్బతీసేలా సీఎం స్థాయిలో అబద్ధాలు చెబుతున్నారు. జంతువుల కొవ్వు వాడకపోయినా.. వాడి లడ్డూలు తయారు చేసినట్లుగా అబద్ధాలతో దుష్ప్రచారం చేసి వెంకటేశ్వరస్వామివారిని అపవిత్రం చేసిన చంద్రబాబును ఎందుకు మందలించడం లేదు? ఎందుకు వెనకేసుకొస్తున్నారు? అంటే మీవాళ్లు ఏం చేసినా పరవాలేదు. మిగిలిన వారు ఏం చేసినా తప్పే! ఇదెక్కడి హిందుత్వం? హిందుత్వానికి మీరు టార్చ్ బేరర్స్ అంటారు. అందరూ ఆలోచించండి''

''హిందుత్వం అంటే మానవత్వం చూపడం..! మానవత్వాన్ని చూపలేని వారు మంచి హిందువునని చెప్పుకోలేరు''

''హిందుత్వంపై బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే టీటీడీ పేరు ప్రఖ్యాతులు మంట కలిపి ఘోరం చేసిన చంద్రబాబును ఎలా ఉపేక్షిస్తున్నారు? ఎందుకు బుద్ధి చెప్పడం లేదు? ఎందుకు మందలించడం లేదు? చేసింది మన వాడే అనుకుని వదిలేస్తే ఏం సందేశం ఇస్తున్నట్లు?. మళ్లీ ఘోరమైన తప్పులు జరగొద్దు. అందుకు చంద్రబాబును మందలించాలి. మతాన్ని, దేవుణ్ని రాజకీయాల్లోకి తేకుండా చంద్రబాబుకు సుప్రీం కోర్టు నుంచి, ప్రధాని నుంచి చీవాట్లు పడాలి. అప్పుడైనా ఈ మనిషికి జ్ఞానం కలుగుతుంది''

– వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో సీఎం చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఒక్కొక్కటిగా రుజువు అవుతూ కనిపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి షోకాజ్ నోటీస్ ఇచ్చామని.. వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా జూలై 23న ఈవో చెప్పిన రెండు నెలల తర్వాత సీఎం చంద్రబాబు సెప్టెంబరు 18న నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని పచ్చి అబద్ధాలాడారని మండిపడ్డారు. 'తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని ఎవరైతే అబద్ధాలతో అవమానించి అగౌరవపర్చాడో.. లడ్డూపై దుష్ప్రచారం చేశాడో.. ఆధారాలతో సహా కనిపిస్తున్న ఈ సత్యం బయటకు రావాలి. చంద్రబాబునాయుడు చేసిన ఈ పాపం కడగబడాలి. అది రాష్ట్ర ప్రజల మీదకు రావొద్దు. పాపం చేసిన చంద్రబాబు మీదే కట్టడి కావాలి. దాని కోసమే టాపిక్ డైవర్ట్ కాకూడదన్న ఉద్దేశంతో వెంకటేశ్వరస్వామిని ప్రేమించే వ్యక్తిగా, గౌరవించే వ్యక్తిగా నా పర్యటనను వాయిదా వేసుకున్నా'అని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని సాక్ష్యాధారాలతో కడిగి పారేశారు. ఈ సందర్భంగా జగన్ ఏమన్నారంటే..

డైవర్షన్ పాలిటిక్స్..: తన 100 రోజుల పాలన గురించి ప్రజల దృష్టి మళ్లించేందుకు లడ్డూల టాపిక్ తెచ్చారు. గుడి పవిత్రత దెబ్బతీస్తూ అడ్డంగా దొరికిపోయే సరికి లడ్డూల టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు కొత్తగా డిక్లరేషన్ అంశాన్ని తెచ్చి రాజకీయం చేస్తున్నారు. తిరుమల పవిత్రత, స్వామివారి ప్రసాదం విశిష్టత, దేవస్థానం పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో రచ్చకీడ్చి రాద్ధాంతం చేశారు. జంతువుల కొవ్వుతో లడ్డూలు తయారైనట్టుగా.. ఒక జరగని విషయాన్ని జరిగినట్లుగా.. ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్లుగా.. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అబద్ధాలాడుతూ, అసత్యాలు పలుకుతూ స్వామి వారి పేరు ప్రఖ్యాతులను, తిరుపతి లడ్డూ విశిష్టతను దగ్గరుండి అపవిత్రం చేసే కార్యక్రమాన్ని సాక్షాత్తూ ఒక ముఖ్యమంత్రే చేస్తుంటే ఇంతకంటే దారుణం, అధర్మం ఎక్కడైనా ఉంటుందా? ఒక్కసారి ఆలోచించండి. చంద్రబాబు ఏ రకంగా అబద్ధాలు చెప్పి రెక్కలు కట్టాడనేది ఆధారాలతో చూపిస్తా. దీన్ని రాష్ట్ర ప్రజలే కాదు.. దేశ ప్రజలంతా గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

దశాబ్దాల ఆనవాయితీ..

తిరుమలలో లడ్డూల తయారీ కోసం నెయ్యి కొనుగోలు కార్యక్రమం దశాబ్దాలుగా జరుగుతోంది. ఆర్నెల్లకు ఒకసారి ఈ–టెండర్ పిలుస్తారు. అర్హులు బిడ్ వేస్తారు. ఎల్–1 గా వచ్చిన వారికి టెండర్ ఖరారు చేస్తారు. ఇందులో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. ఎల్–1గా వచ్చిన వారికి కూడా పూర్తి టెండర్ ఖరారు చేయరు. 65 శాతం వారికిచ్చి మిగతా వారిని కూడా రేటు తగ్గించాలని సూచించి వారికి టెండర్ ఇస్తారు. నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. తిరుపతి లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆ టేస్ట్ మరెక్కడా ఉండదు. తాము సూచించిన ప్రముఖులను టీటీడీ బోర్డులో సభ్యులుగా నియమించాలని కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా రికమెండ్ చేస్తారు. అలాంటి ప్రముఖులతో బోర్డు ఏర్పాటవుతుంది. వారంతా దేవుడికి ఇంకా సేవ చేయాలని, భక్తులకు మంచి చేయాలని నిర్ణయాలు తీసుకుంటారు.

పటిష్ట సరఫరా వ్యవస్థ..: తిరుమలకు సరఫరా చేసే నెయ్యికి సంబంధించి రొబస్ట్ (పకడ్బందీ) విధానం ఉంటుంది. నెయ్యి సరఫరాదారులు ప్రతి ట్యాంకర్‌కు ఎన్ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ ల్యాబరేటరీస్) సర్టిఫై చేసిన క్వాలిటీ సర్టిఫికెట్ తేవాలి. అలా వచ్చిన నెయ్యిని కూడా ప్రతి ట్యాంకర్ నుంచి శాంపిల్ తీసి మూడు టెస్టులు చేస్తారు. అవన్నీ పాస్ అయితేనే ట్యాంకర్‌ను ముందుకు పంపుతారు. ఒక్క టెస్టు ఫెయిల్ అయినా ట్యాంకర్‌ను తిరిగి వెనక్కి పంపిస్తారు. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో 14 నుంచి 15 ట్యాంకర్లు అలా వెనక్కి వెళ్లాయి. మా ప్రభుత్వ హయాంలో 18 ట్యాంకర్లు వెనక్కు పంపారు. అంటే ఎవరూ తప్పు చేయలేని విధంగా అక్కడ రొబస్ట్ విధానం ఉంది. ఏ సరుకులైనా సరే క్వాలిటీ టెస్టులో ఫెయిల్ అయితే వెనక్కు పంపిస్తారు.

వాడని నెయ్యి.. తయారుకాని లడ్డూ..

ఇప్పుడు కూడా అదే జరిగింది. టీటీడీ ట్రస్ట్ బోర్డు అనుమతించిన బిడ్డర్లు జూన్ 12 నుంచి సరఫరా మొదలుపెట్టారు. అంటే అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడింది. ఆ తర్వాతే నెయ్యి సరఫరా మొదలైంది. జూన్ 12, జూన్ 21, జూన్ 25, జూలై 4న వచ్చిన ట్యాంకర్లన్నీ టెస్టుల్లో పాస్ అయి ముందుకు కదిలాయి. వాటిని లడ్డూల తయారీలో వాడారు. ఆ తర్వాత జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 12న మరో రెండు ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి టీటీడీ టెస్టుల్లో ఫెయిల్ కావడంతో వెనక్కు పంపడానికి సిద్ధం చేశారు. సాధారణంగా మరోసారి ఆ శాంపిళ్లను పరీక్షించేందుకు మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారు. కానీ ఇక్కడ మాత్రం గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్)కి పంపారు. ఇది టీటీడీ చరిత్రలో తొలిసారి. టీటీడీ పంపించిన శాంపిల్స్‌పై ఎన్‌డీడీబీ జూలై 23న రిపోర్ట్ పంపింది. నెయ్యిలో కల్తీ ఉందన్న విషయం చెప్పారు. దాంతో ఆ ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అలా 4 ట్యాంకర్లను వెనక్కు పంపడంతో పాటు ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చారు. మరి ఆ నాలుగు ట్యాంకర్ల నెయ్యి వాడకపోయినా.. ఆ నెయ్యిని వాడారని రెండు నెలల తర్వాత సెప్టెంబరు 18న చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఎందుకు అన్నారు? (చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక నియమించిన టీటీడీ ఈవో నెయ్యి నాణ్యత గురించి జూలై 23న ఏమన్నారో వీడియోను ప్రదర్శించారు). ఆ నాలుగు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం. షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా క్రిస్టల్ క్లియర్‌గా ఈవో చెప్పినా రెండు నెలల తర్వాత చంద్రబాబు సెప్టెంబరు 18న ఏ రకంగా అబద్ధాలు మాట్లాడారో చూడండి (ఆ వీడియో ప్రదర్శించి చూపారు). అన్నీ తెలిసినా.. నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని.. లడ్డూలు తయారు చేశారని.. వాటిని భక్తులు తిన్నారని చంద్రబాబు అబద్ధాలు చెప్పారు.



టీడీపీ ఆఫీస్‌లో కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్..

చంద్రబాబు సెప్టెంబరు 18న ఆరోపణలు చేస్తే ఆ మర్నాడే.. అంటే సెప్టెంబరు 19న తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో ఎన్‌డీడీబీ రిపోర్ట్‌ను రిలీజ్ చేశారు. నిజానికి అది కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్. అయినా దాన్ని టీడీపీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు. ఆ వెంటనే మర్నాడు అంటే సెప్టెంబరు 20 టీటీడీ ఈవో మళ్లీ ఏం మాట్లాడారో చూద్దాం.. (ఆ వీడియోను ప్రదర్శించారు). ట్యాంకర్లలో వచ్చిన నెయ్యిలో నాణ్యత లేదని తేలినందువల్ల ఆ నెయ్యిని వెనక్కి పంపామని, వాడలేదని చెప్పారు. అంతే కాకుండా సెప్టెంబరు 22న ఈవో స్వయంగా సంతకం చేసి ప్రభుత్వానికి ఒక నివేదిక కూడా ఇచ్చారు (అందులోని అంశాలు చదివి వినిపించారు). కల్తీ నెయ్యితో వచ్చిన ట్యాంకర్లను వెనక్కు పంపాం.. ఆ కంపెనీకి షోకాజ్ నోటీస్ కూడా ఇచ్చాం.. ఎన్‌డీడీబీ రిపోర్టు చాలా గోప్యమని అందులో ప్రస్తావించారు. మరి దాన్ని అంతకు ముందే తెలుగుదేశం పార్టీ ఆఫీస్‌లో రిలీజ్ చేశారు.

అది అపవిత్రత కాదా?

మళ్లీ సెప్టెంబరు 22న మీడియాతో మాట్లాడిన చంద్రబాబు అవే పచ్చి అబద్ధాలు వల్లించారు. కల్తీ నెయ్యి వాడారని చెప్పారు. స్వామివారి ప్రసాదం విశిష్టతను, తిరుమల ప్రతిష్టను, శ్రీ వెంకటేశ్వరస్వామివారి ప్రసాదం పేరు ప్రఖ్యాతులను రాజకీయ లబ్ధి కోసం ఇలా అబద్ధాలతో తగ్గించడం, కుట్రపూరితంగా వ్యవహరించడం అపవిత్రత కాదా?

ఎన్‌డీడీబీ రిపోర్ట్ కచ్చితమైనది కాదు..

పోనీ.. ఆ ఎన్‌డీడీబీ రిపోర్టు అయినా కచ్చితమైందా? అని చూస్తే ఆ రిపోర్టులో వాళ్లే డిస్‌క్లెయిమర్ రాశారు. 'నెయ్యిలో ఉండాల్సిన స్టాండర్డ్ వాల్యూ కన్నా శాంపిల్స్‌లోని స్టాండర్డ్ వాల్యూస్‌లో డీవియేషన్స్ ఉన్నాయి. అయినా ఈ పరిస్థితుల్లో ఒక ఫాల్స్ పాజిటివ్ ఫలితం కూడా రావొచ్చు. (ఆ పరిస్థితులు ఏమిటంటే అని వివరిస్తూ పాల సేకరణ, అవులు, వాటికి అందించే దాణా గురించి ప్రస్తావించారు). అలాగే ఆవులకు సరైన ఆహారం లేనప్పుడు, అవి సరిగ్గా తినకుండా బలహీనంగా ఉన్నప్పుడు తీసిన పాల నుంచి కూడా ఇలాంటి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

పచ్చి అబద్ధాలు. అపవిత్రం కాదా?

ఇవన్నీ తెలిసినా చంద్రబాబు కావాలని అబద్ధాలాడుతున్నారు. ప్రసాదం స్వీకరించే ప్రతి ఒక్కరిలో అనుమానపు బీజాలు రేకెత్తించడం దుర్మార్గం కాదా? నీ రాజకీయ స్వార్థం కోసం వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను దిగజారుస్తున్నావు చంద్రబాబూ! స్వామి ప్రసాదానికి సంబంధించిన విశిష్టతను దిగజారుస్తున్నావ్. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వుతో ప్రసాదం తయారు చేసినట్లుగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నావు. ఇది ధర్మమేనా?

మీ హయాంలో ఎందుకు వాడలేదు?

నందిని బ్రాండ్ ఎందుకు వాడడం లేదని అంటున్నారు. మరి గతంలో చంద్రబాబు పాలన సమయంలో 2015 నుంచి 2018 అక్టోబరు వరకు కేఎంఎఫ్‌కు చెందిన నందిని బ్రాండ్ నెయ్యి ఎందుకు లేదు? అప్పుడు కూడా టెండర్లు పిల్చారు కదా?

అప్పుడు ఇంత కంటే తక్కువ ధరకే..

రూ.320కి కిలో నెయ్యి ఎలా వస్తుందని చంద్రబాబు అంటారు. మరి చంద్రబాబు 2014–19 మధ్య నెయ్యిని ఏ ధరకు సేకరించారు? ఇప్పుడు కూడా అదే క్వాలిటీ నెయ్యి కదా? దశాబ్దాలుగా అదే క్వాలిటీ. అదే నెయ్యి. చంద్రబాబు హయాంలో 2015లో కిలో నెయ్యి రూ.276కి కొన్నారు. అదే 2019 జనవరిలో కిలో ఆవు నెయ్యిని రూ.324కు కొన్నారు. మరి ఇక్కడ రూ.320కి కొంటే తప్పేం జరిగింది?

ఇది రాక్షస రాజ్యం కాదా?

''రాష్ట్రంలో గతంలో ఎన్నడూ చూడని రాక్షస రాజ్యం నడుస్తోంది.. దేవుడిని దర్శించుకునే కార్యక్రమాన్ని కూడా అడ్డుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నా రాజకీయ జీవితంలో ఇలాంటి రాక్షస రాజ్యాన్ని రాష్ట్రంలోనే కాదు.. దేశంలో కూడా చూడలేదు''అని మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపడ్డారు. (తిరుమల వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పోలీసులు ఇచ్చిన నోటీసులను ఈ సందర్భంగా ఆయన చదివి వినిపించారు). 'జగన్ అనే వ్యకి మాజీ ముఖ్యమంత్రి. ఆయన దేవుడిని దర్శించుకునేందుకు తిరుమల వెళ్తుంటే.. మీకు పర్మిషన్ లేదు.. మీరు వెళ్తే అరెస్టు చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. దీనిపై అందరూ ఒక్కసారి ఆలోచన చేయండి'అని విజ్ఞప్తి చేశారు. 'ఏ ప్రపంచంలో ఉన్నాం? ఇది రాక్షస రాజ్యం కాదా? ఒకవైపు నన్ను వెళ్లనివ్వకుండా చేసి వైఎస్సార్‌సీపీ శ్రేణులు వెళ్లకుండా నోటీసులు ఇస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి బీజేపీ శ్రేణులను రప్పిస్తున్నారు. ఇది ఆ పార్టీ నాయకత్వానికి తెలుసో? లేదో? వేల మంది పోలీసులను మోహరించారు. టాపిక్ డైవర్షన్ కోసం ఎందుకింత ఆరాటం?'అని సీఎం చంద్రబాబును నిలదీశారు.

ప్రతి గుడిలో పూజలు చేయండి..

నేను గుడికి వెళ్లలేకపోయినా ఫరవాలేదు. కానీ చంద్రబాబు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మన పార్టీ తరఫున మీ ఊళ్లలో పూజలు చేయండి. తప్పు చేసింది మేం కాదు.. చంద్రబాబు అని వేడుకోండి. ఆ కోపాన్ని ప్రజలపై కాకుండా చంద్రబాబుపై చూపమని వేడుకోమని కోరుతున్నా. వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు.. రాష్ట్ర శ్రేయస్సు కాంక్షించే ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. చంద్రబాబు చేసిన పాపం వల్ల వెంకటేశ్వరస్వామికి కోపం వచ్చి రాష్ట్రం మీద చూపకుండా, కోపం కేవలం చంద్రబాబుమీదే చూపించే విధంగా పూజలు చేయండి. ఎందుకంటే జరిగింది ఘోర అపచారం. వెంకటేశ్వరస్వామిని పలుచన చేస్తూ, ఆయన ప్రసాదాన్ని లోకువ చేస్తూ.. జరగనిది జరిగినట్లుగా.. జంతువుల కొవ్వు వాడనిది వాడినట్లుగా, ఆ లడ్డూలు పంపిణీ చేసినట్లుగా.. పచ్చి అబద్ధాలాడుతూ ఇంత ఘోరం చేసిన వ్యక్తి చంద్రబాబు. ఆ పాపం కడగబడాలి. అందుకే అందరినీ కోరుతున్నా. పూజలు చేయమని వేడుకుంటున్నా.

నా డిక్లరేషన్ కోరడం ఏమిటి?

''చంద్రబాబు పాపాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఆయన్ను వేలెత్తి చూపుతుండటంతో టాపిక్ డైవర్షన్ కోసమే డిక్లరేషన్ అంటున్నాడు. జగన్ ఇవాళ ఏమైనా కొత్తనా? రాజశేఖర్‌రెడ్డిగారు కొత్తనా? ఆయన ఏమిటో తెలియదా? నా మతం ఏమిటో రాష్ట్రంలో, దేశంలో తెలియదా? నా కులం ఏమిటో తెలియదా? రాజశేఖర్‌రెడ్డిగారు సీఎంగా 5 ఏళ్లు వరుసగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. నేనూ గతంలో చాలాసార్లు వెళ్లాను కదా! సీఎం కాక ముందు కూడా వెళ్లాను కదా! అంతెందుకు.. నా పాదయాత్ర మొదలుపెట్టే ముందు కూడా స్వామివారిని దర్శించుకున్నా. 3,648 కిలోమీటర్ల పాదయాత్ర ముగిసిన తర్వాత తిరుపతి నుంచి కాలి నడకన కొండ ఎక్కా. స్వామివారిని దర్శించుకున్న తర్వాతే ఇంటికి వెళ్లా. అప్పుడు ఉన్నది చంద్రబాబు ప్రభుత్వం. నేను ప్రతిపక్ష నాయకుడిని. రెండు సార్లు స్వామివారిని దర్శించుకున్నాను కదా? ఆ తర్వాత సీఎంగా వరసగా 5 ఏళ్లు స్వామివారికి భక్తి శ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించాను కదా? ఎన్నోసార్లు స్వామి వారిని దర్శించుకున్నా. తొలిసారి ఎవరైనా వెళ్తుంటే అడగొచ్చు. కానీ 10, 11 సార్లు వెళ్లిన తరువాత.. ఈరోజు నేను తిరుపతి వెళ్తానంటే అడ్డుకుంటూ నోటీసులు ఇవ్వడం ఏమిటి?. డిక్లరేషన్ అడగడం ఏమిటి? మా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు నోటీసులు పంపడం ఏమిటి?''అని వైఎస్ జగన్ సూటిగా ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

పోరాట యోధుడు.. కొండా

● ఐటీడీఏ పీఓ రాహుల్



బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: తెలంగాణ రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఎనలేని పోరాట పటిమ చూపారని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పీఓ పూలమాలలు వేసి నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. కాగా, కామేపల్లి మండలం గోపాలపురం తండాకు చెందిన భూక్యా సునీల్‌కుమార్ భూపాల్ ఐఐటీలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతుండగా గిరిజన సంక్షేమ శాఖ తరఫున ల్యాప్‌టాప్‌ను పీఓ అందజేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉద్యోగంలో స్థిరపడడం ద్వారా మరికొందరికి స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఏఓ సున్నం రాంబాబు, వివిధ విభాగాల అధికారులు రమణయ్య, భాస్కరన్, రవీంద్రనాథ్, తానాజీ, ఉదయ్‌కుమార్, మునీర్‌పాషా, అలివేలు మంగతాయారు, హరికృష్ణ, విద్యార్థి తల్లి లలిత తదితరులు పాల్గొన్నారు.

'క్లీన్ భద్రాద్రి' స్వాగతం పలకాలి

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలానికి వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంతో స్వాగతం పలికేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ, భద్రాచలం గ్రామపంచాయితీ స్పెషలాఫీసర్ బి.రాహుల్ అన్నారు. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న ఆయన కార్మికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భద్రాచలాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిని నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం కార్మికులకు సేఫ్టీ మెటీరియ, కాస్మోటిక్ సామగ్రి పంపిణీ చేశారు. ఏపీఓ డేవిడ్‌రాజ్, గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్‌తో పాటు రమ్య, సౌజన్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

బూడిద తరలింపునకు కమిటీ

పాల్వంచరూరల్: పాల్వంచలోని కేటీపీఎస్ నుంచి బూడిద(యాష్) తరలింపులో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. కాలుష్య ప్రభావిత గ్రామాలైన సూరారం, పునుకుల, పుల్లాయిగూడెం, కరకవాగుతోపాటు యాష్‌పాండ్‌ను శుక్రవారం ఆయన కేటీపీఎస్ సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వర్లతో కలిసి పరిశీలించి బూడిద తరలింపునకు దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడారు. కేటీపీఎస్, ఐటీడీఏ అధికారులు త్వరలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి సమక్షాన సొసైటీ సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేసి కమిటీ ద్వారా బూడిద తరలింపు బాధ్యతలను అప్పగిస్తామని పీఓ అన్నారు. కేటీపీఎస్ ఏడీఈ చలపతిరావు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

భాగస్వాముల ఆరోగ్యంపై శ్రద్ధ!



రక్తపరీక్షల కోసం నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

- ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలపై యాజమాన్యం దృష్టి
- ఉద్యోగుల జీవిత భాగస్వాములకు తొలిసారిగా వైద్యపరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబాలు
- ఖమ్మం రీజియన్‌లో మొదలైన హెల్త్ క్యాంపులు



బీపీ పరీక్షిస్తున్న టెక్నీషియన్

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్‌ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్యంపైనే కాకుండా.. వారి జీవిత భాగస్వామి ఆరోగ్యంపైనా యాజమాన్యం శ్రద్ధ చూపుతోంది. ఇప్పటి వరకు ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ క్యాంపుల ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అయితే పని ఒత్తిడి, ఇతర కారణాలతో ఉద్యోగులు వారి జీవిత భాగస్వామి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం లేదని గుర్తించిన యాజమాన్యం మరో అడుగు ముందుకేసింది. ఇందులో భాగంగా జీవిత భాగస్వామికి పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు చేయించాలని నిర్ణయించగా.. ఖమ్మం రీజియన్‌లో వచ్చే నెల 23వరకు కొనసాగే హెల్త్‌క్యాంపులు గత సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి.

తొలిసారిగా..

సహజంగా ఓ సంస్థలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్యంపై యాజమాన్యాలు దృష్టి సారిస్తాయి. ఇందులో భాగంగానే ఆర్టీసీ రెండేళ్లుగా ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తూ, సమస్యలు గుర్తిస్తే చికిత్స అందిస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగుల జీవిత భాగస్వామికి సైతం వైద్యపరీక్షలు చేయిస్తుండడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఉద్యోగుల విధినిర్వహణలో తీరిక లేని పరిస్థితుల్లో తమ జీవిత భాగస్వామికి అనారోగ్య సమస్య వస్తే పరీక్షలు చేయించే వీలు చిక్కడం లేదు. ఈ నేపథ్యాన సంస్థ ఆధ్వర్యాన పరీక్షలు చేయిస్తుండడంపై హర్షణీయమని చెబుతున్నారు.

2,100 మందికి వైద్యపరీక్షలు

ఖమ్మం రీజియన్‌లో ఆర్‌ఎం కార్యాలయంతో పాటు ఏడు డిపోల పరిధిలో ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు ఇతర సిబ్బంది 2,100 మంది ఉన్నారు. గ్రాండ్ హెల్త్ క్యాంపు ద్వారా 2,100 మంది జీవిత భాగస్వాములకు వైద్య పరీక్షలు చేయించనున్నారు. నెల పాటు ఈ క్యాంపులు ఖమ్మం రీజియన్‌లో కొనసాగుతాయి.

డిపోల వారీగా హెల్త్ క్యాంపులు వివరాలు

డిపో	క్యాంపు నిర్వహణ తేదీలు
ఖమ్మం	సెప్టెంబర్ 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు
మధిర	అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 3 వరకు
సత్తుపల్లి	అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 8 వరకు
భద్రాచలం	అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 14 వరకు
మణుగూరు	అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 17 వరకు
కొత్తగూడెం	అక్టోబర్ 18 నుంచి అక్టోబర్ 21 వరకు
ఇల్లెందు	అక్టోబర్ 22 నుంచి అక్టోబర్ 23 వరకు

18 రకాల వైద్య పరీక్షలు

ఆర్టీసీ ఉద్యోగుల జీవిత భాగస్వాముల కోసం సంస్థ ఏర్పాటు చేసిన గ్రాండ్ హెల్త్ క్యాంపుల్లో 18 రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ప్రధానంగా ఈసీజీ, సీబీపీ, సిరం క్రియాటిన్, లిక్విడ్ ప్రొఫైల్, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలను ఈ క్యాంపులో చేస్తున్నారు. ఇవే పరీక్షలను ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో చేయిస్తే రూ.4వేలకు పైగా ఖర్చవుతుంది. కానీ సంస్థ ఉచితంగానే చేయిస్తోంది. ఈ శిబిరాల్లో పరీక్షలు చేయించాక ఏమైనా సమస్యలను గుర్తిస్తే వారిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో చూపించడంతోపాటు హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి రెఫర్ చేస్తారు.

నెల పాటు హెల్త్ క్యాంపులు..



ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ద్వారా వైద్యపరీక్షలు చేయించాం. అవసరమైన వారికి చికిత్స ఇప్పించాం. ఇప్పుడు ఉద్యోగుల జీవిత భాగస్వాములకు పరీక్షలు చేయించాలని ఎండీ నిర్ణయించడంపై హర్షం వ్యక్తమవుతోంది. రోజుకు 70మంది చొప్పున నెల పాటు పరీక్షలు నిర్వహిస్తాం.

– ఏ.సరిరామ్, ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్

అందరికీ సమాచారం ఇస్తున్నాం..



జీవిత భాగస్వాములకు హెల్త్ క్యాంపులో పరీక్షలు చేయించాలని ఉద్యోగులకు సమాచారం ఇస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో నాలుగు రోజులుగా డిపోలో గేట్ మీటింగ్‌ల నిర్వహించడమే కాక వ్యక్తిగతంగా ఫోన్ చేస్తున్నాం. పరీక్షల తర్వాత ఎవరికైనా సమస్యలు ఉన్నట్లు తేలితే చికిత్స ఇప్పిస్తున్నాం.

– డీ.ఎస్.రావు, కండక్టర్, హెల్త్ వలంటీర్, ఖమ్మం డిపో

మంచి నిర్ణయం..



ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి విధినిర్వహణతో తీరిక దొరకడం లేదు. జీవిత భాగస్వాముల ఆరోగ్యంపై ఆలోచించే సమయం ఉండడం లేదు. తొలిసారి ఉద్యోగులతో పాటు మాకు పరీక్షలు చేయించాలని నిర్ణయించడం శుభపరిణామం. ఏమైనా సమస్యలు ఉన్నట్లు తేలితే చికిత్స చేయించుకోవచ్చు.

– ఆర్.వీ.నారాయణమ్మ, ఖమ్మం

కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై దృష్టి

- ప్రత్యేక చర్యలు చేపడుతున్న సింగరేణి
- ఇప్పటికే సీఎంపీఎఫ్, చికిత్స సౌకర్యం
- తాజాగా లాభాల్లో వాటా నుంచి రూ.5వేలు



ఆఫ్ లోడింగ్ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో సుమారు 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వర్తించే వీరు కొన్నాళ్లుగా సంస్థ తరఫున ఎలాంటి సౌకర్యాలకు నోచుకోలేదనే భావన ఉంది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కాంట్రాక్ట్ కార్మికులనూ పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే పరిగణిస్తూ వారి సంక్షేమానికి సంస్థ కృషి చేస్తోంది. సింగరేణిలో సులభ్ కార్మికులు, ఆఫ్ లోడింగ్, నర్సరీ, టిప్పర్ డ్రైవర్లతో పాటు సివిక్, సివిల్, హౌజ్‌కీపింగ్, వాటర్ సప్లయిస్, రైల్వే సైడింగ్, బెల్ట్ క్లీనింగ్, సెక్యూరిటీ, ఆఫీస్ నిర్వహణతో పాటు మొత్తంగా 56 విభాగాల్లోనూ కాంట్రాక్టు కార్మికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఏమేం సౌకర్యాలు...

■ కార్మికులకు సీఎంపీఎఫ్‌గా 12శాతం వేతనంలో మినహాయిస్తే మరో 12 మరో శాతం సంస్థ జోడించి ఆర్థికంగా సహకారం అందిస్తోంది. అంతేకాక సీఎంపీఎఫ్ లెక్కలను ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం వెల్లడిస్తుండడంతో భరోసాగా ఉంటున్నారు.

■ పర్మినెంట్ కార్మికులతో సమానంగా సింగరేణి వ్యాప్త 11 ఏరియాల ఆస్పత్రుల్లో కాంట్రాక్టు కార్మికులకూ వైద్య సౌకర్యం కల్పించారు.

■ దీపావళి బోనస్ పర్మినెంట్ కార్మికులకు లమ్‌సమ్‌గా ఇస్తే, కాంట్రాక్టు కార్మికులకు మస్టర్‌కు రూ.54 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ విధానం కోలిండియాలో ఎక్కడా లేదు.

■ గతంలో ఎన్నడూ లేనివిధంగా కంపెనీ సాధించిన ఆర్థిక సంవత్సరం లాభాల వాటాలో ప్రతీ కార్మికుడికి రూ.5వేలు చెల్లించాలని నిర్ణయించారు.

■ క్యాంటీన్‌లో తక్కువ ధరతో టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

షరతులు లేకుండా వాటా..



సులభ్, ఆఫ్ లోడింగ్, నర్సరీ, గుట్కా షెడ్డు కార్మికులు, టిప్పర్ డ్రైవర్లకు కూడా లాభాల వాటాలో రూ.5వేల చొప్పున చెల్లించాలి. వీరిని మినహాయించాలనే ఆలోచన సరికాదు. అన్ని విభాగాల కార్మికులకు చెల్లిస్తేనే ఫలితముంటుంది.

– యాకూబ్‌షావలీ, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఖాళీ క్వార్టర్లు కేటాయించాలి



వేలాది క్వార్టర్లు అన్యాక్రాంతం అవుతున్నందున కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలి. తద్వారా సింగరేణి స్థలాల ఆక్రమణ జరగదు. ఇళ్ల అద్దె చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న మాకు క్వార్టర్లు కేటాయిస్తే మరమ్మతు చేయించుకుని నివసిస్తాం.

– నిర్మల, కాంట్రాక్ట్ కార్మికురాలు

అందంగా డైనింగ్ హాల్



ఖమ్మం కలెక్టరేట్‌లోని డైనింగ్ హాల్ కొత్త అందం సంతరించుకుంటోంది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచనలతో గోడలపై వివిధ రకాల కూరగాయలు, పండ్లు తదితర చిత్రాలను వేయిస్తున్నారు. చిత్రకారులు వీటిని అందంగా తీర్చిదిద్దుతుండడంతో డైనింగ్ హాల్ కొత్త రూపు సంతరించుకుంటోందని ఉద్యోగులు చెబుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్